
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శనివారం 18 అక్టోబరు 2025





పురుగు పడుతున్న బియ్యం

ముక్కిపోయి.. పురుగులు పట్టి

- రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం నిల్వలు
- ఆరు నెలలుగా రేషన్ డీలర్ల ఇబ్బందులు
- సర్కారు వేలం పాటపై స్పష్టత కరువు
- జిల్లాలో 346 రేషన్ దుకాణాలు.. 5.65 లక్షల మంది లబ్ధిదారులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పేదలకు ఉగాది నుంచి రేషన్ దుకాణాల ద్వారా సర్కార్ సన్నబియ్యం పంపిణీచేస్తూ వారిలో సంతోషాన్ని నింపింది. సన్న బియ్యం పంపిణీకి ముందు మార్చి మాసంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో చౌకధరల దుకాణాలు, గోదాముల్లో నిల్వ ఉంచిన దొడ్డు రకం బియ్యంపై నిర్లక్ష్యమే చూపుతోంది. దీంతో జిల్లా లో నిల్వ ఉన్న దొడ్డురకం బియ్యం ముక్కిపోయి, పురుగులు పట్టి పాడైపోతున్నాయి. మరోవైపు రేషన్ డీలర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం దొడ్డురకం బియ్యానికి వేలం వేయ నున్న ట్లు ప్రకటిం చిన ఆచరణలోకి రాలేదు. సర్కార్ వేలంపాట ఎటూ తేలకపోవడంతో ఆరు నెలలుగా దొడ్డుబియ్యం పురుగులు పట్టడమే కాకుండా ఎలుకల బెడద డీలర్లను కలవరపెడుతోంది.

సన్న బియ్యం రాకతో దొడ్డు బియ్యం కష్టాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 346 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 1.92 లక్షల రేషన్ కార్డులు ఉండగా, 5.65 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 3275364 కిలోల బియ్యాన్ని కేటాయిస్తున్నారు. ఇందులో ప్రతినెల రేషన్ డీలర్ల వద్ద 4నుంచి 6 లక్షల కిలోల బియ్యం నిల్వలు ఉంటున్నాయి. ఏప్రిల్ మాసంలో సన్న బియ్యం పంపిణీ ముందు దొడ్డు బియ్యం నిల్వల లెక్కలు తీసి రేషన్ దుకాణాల్లో నిల్వ ఉంచారు. పోర్టబులిటీ విధానంతో కార్డుదారుడు రాష్ట్రంలో ఎక్కడైనా బియ్యం తీసుకునే వెసులుబాటు వచ్చింది. దీంతో రేషన్ డీలర్లు నిర్ణీత కోటాకు మించి బియ్యం నిల్వ ఉంచుకున్న వారు ఉన్నారు. ఇలా ఒక్కో రేషన్ డీలర్ వద్ద సుమారుగా 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. సన్న బియ్యం పంపిణీకి ముందు మార్చి నెలలో రేషన్ డీలర్ల వద్ద జిల్లాలో 471629 కిలోల బియ్యం నిల్వలు ఉన్నాయి. దీంతోపాటు సిరిసిల్ల గోదాములో 320బ్యాగుల వరకు నిల్వ ఉన్నాయి. రేషన్ దుకాణాలు అద్దె గదులు కొనసాగుతున్నాయి. ఇరుకుగా ఉండడంతో దొడ్డు బియ్యం నిల్వలతో ఇబ్బంది పడుతున్నారు. అల్పపీడన ప్రభావంతో బారీగా కురిసిన వర్షాలకు బియ్యం ముక్కిపోతున్నాయి. బియ్యానికి పురుగులు పట్టడంతో పాటు ఎలుకల బెడదతో బియ్యం పనికి రాకుండాపోతున్నాయి. సన్న బియ్యం, దొడ్డు బియ్యం నిల్వలు - మిగతా 8లో

జిల్లాలోని ఓ రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు రకం ధాన్యం

అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ ఎం. హరిత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిత

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరక్షరాస్య వయోజన మహిళలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం. హరిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ(ఉల్లాస్)పై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యాశాఖ, మెప్మా శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరక్షారాస్య వయోజన మహిళలకు ఫౌండేషన్ లిటరసీ, బేసిక్ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై అవగాహన అందించడం కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమన్నారు. వయోజనుల కోసం అక్షర వికాసం వలంటర్ల కోసం మార్గదర్శిని పుస్తకాలు ప్రభుత్వం జిల్లాకు పంపిణీ చేసిందన్నారు.అక్షర వికాసం పుస్తకాలు 21,894 రాగా, మార్గదర్శిని 2190పుస్తకాలు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 23387 మంది వయోజనులను గుర్తించామన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, ట్రైనీడిప్యూటీ కలెక్టర్ నిఖిత, వయోజన విద్య శాఖ అధికారి అంజనేయులు, ఎంఈవోలు ఏపీఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా అవ్యవస్థీకృత రంగలోని కార్మికులకు న్యాయసేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న న్యాయ సేవలను కార్మికులు సమర్థవంతగా ఉపయోగించకోవాలన్నారు. అనంతరం అవ్యవస్థీకరణ రంగలోని కార్మికులకు న్యాయ అవగాహన దాని ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులు, ప్రయాణికులకు అవగాహన

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ ఆరోగ్యమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో యువతకు, విద్యార్థులకు 108 సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. వ్యక్తులకు అకస్మాత్తుగా గుండెపోటు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న సందర్భంలో సీపీఆర్ చేయాలని చాతిపై చేతులతో ఒత్తడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల 108 సిబ్బంది పెద్ది శ్రీనివాస్, జలగం సత్యసాగర్, వర్గాల అనిల్‌కుమార్, మొగిలి సుధాకర్ పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : ప్రథమ చికిత్సలో అత్యంత కీలకమైన సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని వేములవాడ 108అంబులెన్స్ సర్వీస్ సిబ్బంది సూచించారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండు సమీపంలో ప్రయాణికులు అవగాహన కల్పించారు. 108 సిబ్బంది ఈఎంటీ ప్రవీణ్, విక్రమ్, లక్ష్మణ్, అనిల్ సీపీఆర్ చేసే విధానాన్ని ప్రయాణికులకు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. అత్యవసర పరిస్థితుల్లో ఏవిధంగా ధైర్యంగా స్పందించి 108 సేవలను వినియోగించుకోవాలో కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వేగంగా ఆలయ విస్తరణ పనులు..
- కొనసాగుతున్న భక్తుల దర్శనాలు 7

దళారుల చేతిలో పత్తి రైతులు దగా..
- బండరాళ్లతో తూకం.. 8

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీ ప్రభుత్వం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్



సిరిసిల్లలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో అమలుచేయకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లను కల్పించాలని బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన బంద్‌లో బీసీ సంఘాలన్నీ బీజేపీ వ్యతిరేకంగా పోరాటం చేస్తేనే సీపీఎం మద్దతుగా పాల్గొంటుందని, లేకుంటే స్వతంత్రంగా బీసీ రిజర్వేషన్‌లకు పోరాటం చేస్తుందని, బంద్‌లో స్వతంత్రంగా పాల్గొంటుందన్నారు. బీసీ రిజర్వేషన్‌లపై బీజేపీ కపట నాటకం ఆడుతుందని రాష్ట్రంలో మద్దతు ఇస్తూ కేంద్రంలో బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా అడ్డుకుంటుందని, కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గంలో ఎక్కడ పర్యటించినా బీసీ ప్రజలందరు నిలదీయాలని కోరారు. బీసీ బంద్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల చెల్లింపులో జాప్యం సరికాదు..

- కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం జ్యాపం సరికాదని జిల్లా రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లారపు పురుషోత్తం అన్నారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం జిల్లా రిటైర్డ్ ఉద్యోగ, ఉపా ధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు పదవీ విమరణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలు వచ్చేవరకు ఆందోళనలు చేపడుతామన్నారు. 18నెలలు గడిచినా ఇంతవరకు ఉద్యోగు లకు రావాల్సిన బకాయిలు, జీపీఎఫ్, జీఐఎస్ ఇతర ప్రయోజనాలు అందడం లేదన్నారు. ఉద్యోగ విర మణ పొందిన తర్వాత రావాల్సిన ప్రయోజనాలు వెంటనే రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్‌లకు రావాల్సిన బకాయిలను ఏక మొత్తంలో చెల్లించాలని కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రేవా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్, కనపర్తి దివాకర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యావనపల్లి పరమేష్, పిల్లధర్మయ్య, వంగ సుధాకర్, జనపాల వెంకటయ్య, మద్దికుంట లక్ష్మణ్, ఎస్‌ఆర్ వెంకటేశ్వర్లు, తిరుపతి, మామిడిపల్లి శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, సాన రవీందర్, ప్రభాకర్, కుబేర స్వామి, రెహమాన్, సాదత్‌అలీ, సయ్యద్ మహబూబ్, ప్రకాష్‌రావు, గోవిందరావు, అంజయ్య, గాజులు రాఘవేందర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకంపై గ్రామ సభ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, ఎంపీవో జోగం రాజు అధ్యక్షతన ఉపాధిహామీ పథకంపై శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రామాభివృద్ధి ప్రణాళికను ప్రభుత్వానికి నివేదించామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించడంతో ప్రణాళికను తిరిగి పంపించామని అన్నారు. 2026-2027 సంవత్సరానికి ఉపాధిహామీ పథకం కింద చేపట్టనున్న పనులు, కూలీల వేతనాలపై చర్చించారు. ఉపాధి హామీ నిధులతో కూలీలకు పని కల్పించడం, గ్రామాన్ని అభివృద్ధి పర్చడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీవో జోగం రాజు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సారిక, ఈజీఎస్ సిబ్బంది రాజు, ప్రభాకర్, జీపీవో వినోద్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధన్‌తేరాస్..

- ధన త్రయోదశి పూజతో ధనాభివృద్ధి..

- దీపం వెలిగించడంతో అపమృత్యు నివారణ



పూజ నిర్వహిస్తున్న మహిళలు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

దీపావళి.. దీప కాంతుల పండుగ. దీపావళికి మూడు రోజుల ముందు ధన త్రయోదశి పూజలు జరుపుకుంటారు. ధన్‌తేరాస్‌గా కూడా పిలుస్తారు. సోమవారం దీపావళి జరుపుకుంటారు. ధనత్రయోదశి పూజలు మాత్రం శనివారం జరుపుకోవడానికి వ్యాపారస్థులు, ప్రజలు సిద్ధమవుతున్నారు. దీపం వెలిగించడంతో అపమృత్యు నివారణతో పాటు ధనత్రయోదశి పూజలతో ధనాభివృద్ధి కలుగుతుందని నమ్మకం. దేవతలు, దానవులు సాగరమథనం చేసినప్పుడు లక్ష్మీదేవి ఉద్భవించిందని చెప్పుకుంటారు. లక్ష్మీదేవితో పాటు ధన్వంతరి అమృత కళశంతో వచ్చింది కాబట్టే ఆ రోజునే ధన త్రయోదశిగా జరుపుకుంటారు. పాడి పశువులు ఇంటికి వచ్చే సమయంలో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ధన పూజలు చేస్తే ధన, ధాన్య సమృద్ధి జరుగుతుందని నమ్మకం. ధనానికి దేవి లక్ష్మి. ఆ లక్ష్మీదేవిని పొందాలంటే సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ఉండాలి. అందుకే ధన్వంతరిని కూడా పూజిస్తారు. కార్తీక మాసం, కృష్ణపక్షం, త్రయోదశి తిథి నాడు ధన్వంతరి జన్మించాడు. అందుకే ఆరోజు బంగారంతో పాటు వెండి ఆభరణాలు నూతన వస్తువులు కొనుగోలు చేయడం అనాదిగా వస్తోంది. ఎక్కువగా ఈ రోజున బంగారం, వెండితో పాటు దీపావళి అనంతరం ధాన్య గింజలను విత్తుకుంటారు. ధన్‌తేరాస్ రోజు బంగారం కొనుగోళ్లు ఎక్కువగా చేస్తారు. దీంతో బంగారం అమ్మకందారులు ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈసారి బంగారం ధరలు భయపెట్టే విధంగా పెరుగుతుండటంతో ధన్‌తేరాస్ కూడా చిన్నబోతోంది.

పురాణ గాథ..

ధన త్రయోదశి విశిష్టతను చెప్పే పురాణ గాథలు కూడా ఉన్నాయి. యమదూతలు అకాల మరణం నుంచి తప్పించుకునే ఉపాయం చెప్పమని భూలోక వాసులను కోరగా కార్తీక కృష్ణ పక్షం త్రయోదశి రోజున యముని పేరిట పూజలు చేసి దీపాలను దక్షిణ దిశ వైపు ఉంచితే అకాల మృత్యు భయం తొలగిపోతుందని, యముడు ప్రవచించినట్లు ప్రతీతి. అందుకే ధన త్రయోదశి రోజు ఇళ్ల ముంగిట్లో, వ్యాపార ప్రాంగణాల్లో దీపాలను వెలిగించే పరంపర కొనసాగుతోంది.

ధన్వంతరి పూజా ప్రత్యేకత..

ధన త్రయోదశి రోజు ధన్వంతరి పూజకు ఎంతో విశిష్టత ఉంది. ధన పూజతో ధనాభివృద్ధి కలుగుతుందని భావిస్తారు. దీపం దక్షిణ దిశవైపు ఉంచి వెలిగించడంతో అపమృత్యు నివారణ జరుగుతుందని, ధన్వంతరి పూజతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని భావిస్తారు.

బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘాల పెద్దలు 42 శాతం రిజర్వేషన్ రాజకీయ, విద్యా, ఉద్యోగపరంగా ఇవ్వాలని ఇచ్చిన బంద్ పిలుపునకు కాంగ్రెస్ పార్టీ పక్షాన సంపూర్ణ మద్దతును తెలుపుతున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ 42శాతం రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు అవకాశాలు కల్పిస్తామని చెప్పామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ బిడ్డ కానప్పటికీ అసెంబ్లీలో 42 శాతానికి సంబంధించిన రిజర్వేషన్‌పై బిల్లులను ప్రవేశపెట్టడం ఆ బిల్లులను బలపరిచే అవకాశం బీసీ బిడ్డగా తనకు వచ్చిందన్నారు. రెండు బిల్లులు కూడా గవర్నర్, రాష్ట్రపతి వద్దకు వెళ్లి ఆగిందని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కృత నిశ్చయంతో ముందుకు పోవడం కోసం చేస్తున్న ప్రయత్నంలో హైకోర్టులో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయిన తర్వాత స్టే వచ్చిందని అన్నారు. సుప్రీం కోర్టులో 50శాతం క్యాప్ మించి ఇవ్వవచ్చు అనే వాదన చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీకి సంబంధించిన ప్రజా సంఘాల ప్రజలను మేల్కొల్పే విధంగా 42 శాతం రిజర్వేషన్ అమలు కావాలని కోరుకుంటూ ఇచ్చిన బంద్ పిలుపునకు మద్దతు ఇస్తున్నామని అన్నారు. అన్నివర్గాల ప్రజలు సహకరించాలని అన్నారు. బీజేపీ బీసీల పక్షాన నిలబడాలని కోరారు. శాసనసభలో 8 మంది ఎమ్మెల్యేలు బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇస్తున్నారని కేంద్ర ప్రభుత్వం వద్ద 8 మంది ఎంపీలు ఎందుకు వద్దంటున్నారో బీసీ సమాజానికి సమాధానం చెప్పాలని అన్నారు. రాష్ట్రపతి, గవర్నర్ అపాయింట్మెంట్ కూడా దొరకని సందర్భాలను గుర్తు చేశారు. జీవో 9 తీసుకొస్తే బీజేపీ చీఫ్ రామచంద్రరావు స్వాగతిస్తున్నారని, నరేంద్ర మోదీ వద్ద మాత్రం నోరు విప్పడం లేదన్నారు బీసీ బిడ్డల నోటి కాడికి వచ్చిన ముద్దను లాక్కోవద్దని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలో 50 శాతం క్యాప్ ఎక్కడ లేదని, కోర్టులో జీవో 9పై సవాల్ చేశారుకానీ చట్టంపై కాదన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హనుమాండ్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ చేనేత సెల్ అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు దేవయ్య, ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మ దహనం



రసమయి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో రసమయి బాలకిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సత్యనారాయణను అసభ్యంగా దూషించిన రసమయి బాలకిషన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రసమయి బాలకిషన్ వ్యవహరించిన తీరు తీవ్రంగా అభ్యంతరకరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేతో పాటు కుటుంబీకులపై మాట్లాడిని తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి పదాలు వాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మచ్చ రాజేశం, ఫిషరీస్ కమిటీ చైర్మన్ జెట్టి మల్లేశం, మైనార్టీసెల్ అధ్యక్షుడు జమాల్, నాయకులు కరివెద కర్నాకర్‌రెడ్డి, జుట్టు నగేష్, సాయివర్మ, మల్లయ్య, బడుగు లింగం, బంగారి ఆంజనేయులు, లక్ష్మన్, రవి, దయాసాగర్, బాబు, సత్యం, రమేష్, శ్రీకాంత్, నర్సయ్యలతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ

● యువకుడి మృతి

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టగా ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం శాంతాపూర్‌కు చెందిన బెక్కం సతీష్(35) అనేవ్యక్తి తన ద్విచక్ర వాహనంపై లక్షెట్టిపేట వైపు వెళ్లుతున్నాడు. అదే సమయంలో ఏపీ 25హెచ్ 2255 నంబరు గల కారు ఎదురుగా వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. ఈ సంఘటనలో సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికురాలి మృతి

కరీంనగర్ క్రైం/టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జ్యోతినగర్ పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్ నగర్‌కు చెందిన మున్సిపల్ స్వీపర్ బదుగు రేణుక(57) విధినిర్వహణలో ఉండగా ఉదయం 10గంటల ప్రాంతంలో జ్యోతినగర్ పెట్రోల్ బంక్ నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి వేగంగా ఆమెను ఢీకొట్టాడు. దీంతో రేణుక తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన రేణుకను ఆసుపత్రికి తరలించగా 11:40గంటలకు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి తక్షణ సహాయం కింద 20వేల రూపాయల నగదు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో సుమన్, శానిటరీ సూపర్‌వైజర్లు శ్యామ్‌రాజ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య


జ్యోతి(ఫైల్)

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ చదువుతున్న ఓ యువతి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికిచెందిన బోయిన జ్యోతి(21) డిగ్రీ సెకండియర్ చదువుతోంది. గురువారం రాత్రి జ్యోతి పురుగుల మందుతాగింది. తల్లిదండ్రులు గుర్తించివెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం పదిగంటలకు చికిత్సపొందుతూ మృతిచెందింది. తన కూతురు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడానికి మృతురాలి స్నేహితుడి ప్రేమ వేధింపులే కారణమంటూ తల్లి బోయిని రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణం మృతురాలి కాలేజీ స్నేహితుడా లేక గ్రామానికి చెందిన స్నేహితుడా అనేది దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


జంగరాజు(ఫైల్)

రామగిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన జంగరాజు(38) అనే యువకుడు బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజును హుటాహుటిన వరంగల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య జంగ స్రవంతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్స్ అందజేత


బాధితులకు సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 4సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ వాటిని యజమానులకు అప్పగించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

తిమ్మాపూర్ : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన కాత రాజకుమార్ ఆరునెలల క్రితం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను శుక్రవారం రికవరీ చేసి ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బాధితుడు రాజకుమార్‌కు అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లయితే సీఐఈఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.



కారుణ్యంపై కనికరమేది?

● ఉపాధి లేక రోడ్డున పడుతున్న కుటుంబాలు
● ప్రభుత్వ కాలయాపనతో ఆందోళన
● ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి

వేములవాడ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగి మరణించినా, మెడికల్ అన్‌ఫిట్ అయిన సందర్భంలో ఇచ్చే కారుణ్య నియామకాలపై ఎన్నో కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో మరణిస్తే ఆ కుటంబానికి జీవనాధారం కల్పించేందుకు ఆ కుటంబంలో అర్హత గలిగిన ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. కారుణ్య నియామకాలపై కాలయాపన జరుగుతుండటంతో ఉద్యోగి కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని కారుణ్య నియామకాలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

నియామకాలకు ఎవరు అర్హులు :

ప్రభుత్వ ఉద్యోగులు మరణించినా లేక ఆరోగ్య సమస్యలతో ఉద్యోగం చేయలేని పరిస్థితి ఏర్పడిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉండేందుకు కుటుంబంలో అర్హత గల ఒకరికి ఉద్యోగం కల్పిస్తారు. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి వారసులు, వైద్య కారణాలతో రిటైర్‌మెంట్ తీసుకున్న ఉద్యోగి వారసులు, ఏడేళ్ల పాటు కనిపించకుండా పోయిన ఉద్యోగి వారసులు కారుణ్య నియామకానికి అర్హులు.

కారుణ్య నియామకాల విధి విధానాలు

కారుణ్య నియామకాలు ఎవరికిస్తారన్న అనుమానాలు చాలా మందికి ఉంటాయి. దానికి విధివిధానాలు ఉన్నాయి. ఉద్యోగి భార్య లేదా భర్త, లేదా కుమారుడు, కుమార్తెలు ఉద్యోగానికి అర్హులు అవుతారు. ఉద్యోగి మరణించిన నాటికి 5 సంవత్సరాల ముందు చట్టబద్ధంగా దత్తత తీసుకున్న కుమారుడు లేదా కుమార్తెకు ఇవ్వవచ్చు. ఉద్యోగి భార్య, భర్త నియామకానికి ఇష్టపడిన సందర్భంలో ఆ కుటుంబంపై ఆధారపడిన వివాహిత కుమార్తెకు ఇవ్వవచ్చు. ఉద్యోగి అవివాహితుడై మరణించినట్లయితే అతని సోదరుడు, సోదరికి కారుణ్య నియామకం కల్పించవచ్చు.

ఏ పోస్టుల్లో నియమిస్తారు :

జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో గానీ అంతకన్న తుక్కువ గానీ కారుణ్య నియామకాలను ఇవ్వవచ్చు. ఆ పోస్టుకు స్కేల్‌కు మించని పోస్టులో గానీ అంతకన్న తక్కువ పోస్టులో గానీ నియమించే వెసులుబాటు ఉంటుంది.

నియామకపు విధానం :

ఉద్యోగి మరణించిన ఏడాదిలోపు అతని కుటుంబ సభ్యులు నియామకం కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. ఆయా పోస్టులకు సంబంధించిన సరైన అర్హత కలిగి ఉండాలి. జూనియర్ అసిస్టెంట్ ఐతే తప్పనిసరిగా ఇంటర్మీడియట్ చేసి ఉండాలనే నిబంధన ఉంటుంది. మరణించిన ప్రభుత్వ ఉద్యోగి పనిచేసిన యూనిట్‌లో నియామకం చేస్తారు. కలెక్టర్ ఇతర డిపార్టుమెంట్‌లకు కేటాయించవచ్చు. ఖాళీలు లేని సందర్భంలో కలెక్టర్ ఒక క్యాలెండర్ సంవత్సరంలో 5 వరకు సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించే అధికారం కలెక్టర్‌కు ఉటుంది.

కారుణ్య నియామకం సాధ్యపడనప్పుడు

కారుణ్య నియామకం సాధ్యపడనప్పుడు నాలుగో తరగతి ఉద్యోగుల కుటుంబాలకు రూ. 40 వేలు, నాన్ గెజిటెడ్ వారికి రూ. 60 వేలు గెజిటెడ్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.80 వేలు ఏక్స్‌గ్రేషియా చెల్లించవచ్చును.

ప్రభుత్వం కారుణ్య నియామకాలపై దృష్టిసారించాలి



బూర సదానందం, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్..

ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆయా, కారణాలతో మృతి చెందిన వారు, అనారోగ్యంతో ఉద్యోగానికి దూరమైన వారి కుటుంబ సభ్యులకు జీవో ఉత్తర్వుల ప్రకారం కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి. ఉపాధ్యాయుల సమస్యలపైన ప్రభుత్వం దృష్టిసారించాలి. ఉపాధ్యాయులను కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి..

దిక్కుతోచని స్థితితో కుటుంబాలు



వంగ తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మరణించిన వారి కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఉద్యోగాలు కల్పిస్తే మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునే అవకాశం కల్పించినట్లు ఉంటుంది.

నాన్న మృతి చెంది సంవత్సరం దాటింది..



పూరేల్లి కల్పన, మరణించిన ప్రభుత్వ ఉద్యోగి కూతురు

మా నాన్న పూరేల్లి రవీందర్ వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో హెచ్ఎంగా పనిచేశారు. మా నాన్న అకాలమరణం చెంది సంవత్సరం దాటుతుంది. కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఉద్యోగం ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఎంబీఏ పూర్తి చేసి ఉన్నాను.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోతెవాగు పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వన్నారం, మోతె నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి వివిధ గ్రామాలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్‌ఐ కె రాజు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మల్లాపూర్ : మండలంలోని చిట్టాపూర్ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని మల్లాపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలోని గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలించిన, నిల్వచేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని గోదావరినది పరివాహక గ్రామాలతో పాటువాగుల నుంచి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా ఇసుకను తరలించినా , నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రసమయి ఫాంహౌస్‌పై దాడికి యత్నం

● వివిధ మండలాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు ● అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత

బెజ్జంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు చెందిన ఫాంహౌస్‌పై కాంగ్రెస్‌కార్యకర్తలు శుక్రవారం దాడికి యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నంలో ఉద్రిక్తత నెలకొంది. పలువురు కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు ఒకరిపై మరొకరు విమర్శలు, దూషణలు చేసుకున్న ఓఆడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రసమయి వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం అన్నిమండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మండలంలోని గుండారం గ్రామంలోని రసమయి బాలకిషన్‌కుచెందిన ఫాంహౌస్‌ను ముట్టడించేందుకు నియోజకవర్గంలోని బెజ్జంకి, ఇల్లంతకుంట, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌నాయకులు వివిధమార్గాల్లో వచ్చారు. విషయం తెలిసుకున్న పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, కొందరు ఫాంహౌస్‌పైకి రాళ్లు విసిరారు. దీంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈక్రమంలో పోలీసులు పలువురి అదుపులోకి తీసుకుని బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిద్దిపేట రూరల్‌సీఐ శ్రీను, ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో పోలీసు బలగాలను భారీగా మోహరించారు. కాంగ్రెస్‌నాయకులు రసమయికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే సత్యనారాయణకు.. రసమయి బాలకిషన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుస్టేషన్‌లో ఉన్న నాయకులు, కార్యకర్తల వద్దకు ఎమ్మెల్యే సత్యనారాయణ చేరుకొని వారితో మాట్లాడి మాజీఎమ్మెల్యే రసమయిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకుముందు స్థానిక ఎడ్లబండి చౌరస్తాలో రసమయి బాలకిషన్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.


పగిలిన ఫాం హౌస్ కిటికీ అద్దాలు

మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమరవాణా, లైంగిక వేధింపులు, పిల్లలతో భిక్షాటన, కూలీ పనులు చేయించడం, అవయవ దోపిడీ, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన టాస్క్‌ఫోర్ ఎస్సై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరీంనగర్ మానవ అక్రమరవాణా నియంత్రణ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఇన్‌చార్జి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సురేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ ఐటీ టవర్ సమీపంలోని టీజీ ఎంప్లాయిబిలిటీ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో విద్యార్థులకు పైఅంశాలపై వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

ఉప్పరమల్యాలలో 11మందిపై పిచ్చికుక్క దాడి

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఉప్పరమల్యాలలో 11మందిపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. గురువారం సాయంత్రం గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ దొరికిన వారిని కాళ్లు, చేతులు, ఇంటి ఆవరణలో కూర్చున్న వారి వీపులపై తీవ్రంగా కరిచింది. రక్తస్రావమైన బాధితులు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. అయితే ఒకే కుటుంబంలో తల్లీ ఇద్దరు కూతుళ్లు వాకిట్లో కూర్చోగా వారిపై విరుచుకుపడింది. కుక్క బారినుంచి తప్పించుకునేందుకు తల్లీ కూతుళ్లు ప్రయత్నించినా తల్లిని వీపుపై కూతుళ్లను కాళ్లు, చేతులపై కరిచింది. పిచ్చికుక్క బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటి ప్రహరీని ఢీకొట్టిన కంటైనర్

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్శకుర్తిలో కంటైనర్ అదుపు తప్పి ఇంటి ప్రహరీతోపాటు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడగా అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి భారీ కంటైనర్ విజయవాడ వెళ్తోంది. డ్రైవర్ మద్యం మత్తులో దారి తప్పి గర్శకుర్తి మీదుగా వాహనాన్ని మళ్లించాడు. గర్శకుర్తిలో రోడ్డు పక్కన ప్రహరీ, ఆ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో గోడకూలి విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరాను నిలిపివేశారు. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. విద్యుత్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసూరి శంకరయ్య(58) కొంతకాలంగా అప్పులతో ఆర్థికంగా బాధపడుతున్నాడు. ఈనెల 16న పనికి వెల్లుతున్నానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. రెండు రోజులైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు అదృశ్యం అయినట్లు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

మంథని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వ్యాపారాల పేరుతో పెట్టుబడి పేరిట పలువురి వద్ద భారీగా అప్పులు తీసుకొని మోసాలకు పాల్పడిన బందం చంద్రశేఖర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడు మంథనికి చెందిన బండారి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి గోదావరిఖని కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. నిందితుడు చంద్రశేఖర్ మంథని చెందిన దాదాపు 25 మంది వద్ద వ్యాపార పెట్టుబడిల పేరిట వడ్డీ ఎక్కువగా ఇస్తానని నమ్మించి దాదాపు 5-6కోట్లు వసూలు చేసినట్లు ప్రచారం సాగుతోంది. మరికొందరు బాధితులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.6800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.6800 పలికింది. శుక్రవారం మార్కెట్‌యార్డుకు 159మంది రైతులు 1238 క్వింటాళ్లు విడిపత్తి, 31మంది రైతులు 43క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికితీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.6800, కనిష్ఠధర రూ.4800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

నిప్పంటుకొని వంట సామగ్రి, దుస్తులు దగ్ధం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎం శాంత అనే మహిళ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. శాంత ఇంటికి తాళం వేసి పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు ఇంట్లో నిప్పంటుకుని సామన్లు, దుస్తులు దగ్ధమయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు ఇంటితాళం పగుల గొట్టి మంటలార్పారు. రామగుండం రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రూ.10వేల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

రైస్‌మిల్లులో ఇసుక అక్రమ నిల్వ

● గుట్టుగా సాగుతున్న దందా
● పట్టుకున్న సిబ్బందిని నెట్టేసి టిప్పర్లతో సహా పరార్

కథలాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో కోరుట్లకు వెళ్లేదారిలో ఉన్న రైస్‌మిల్‌లో వడ్లను నిల్వచేయడానికి బదులు ఇసుక డిపోగా మార్చేశారు. కొన్ని నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ దందా కొనసాగుతున్నట్లు రెవెన్యూ అధికారులు పక్కాసమాచారం అందుకుని గురువారం రాత్రి అకస్మికంగా దాడులు చేశారు. ఆ సమయంలో రెండు టిప్పర్లలో ఇసుకను నింపుతుండగా సిబ్బంది పనులను నిలిపివేశారు. ఒక్కసారిగా డ్రైవర్లు సిబ్బందిని నెట్టేసి టిప్పర్లను స్టార్ట్ చేసుకుని కోరుట్ల వైపు పరారయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది కోరుట్ల పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడ పట్టుకుని ఆర్టీసీడిపో శివారులో నిలిపి వేశారని తెలిసింది. రైస్‌మిల్ యజమాని తక్కళ్లపల్లి శివారులో ఉన్న పెద్దవాగు నుంచి ట్రాక్టర్లతో ప్రతీనిత్యం రైస్‌మిల్లుకు ఇసుకను తరలించి నిల్వ చేస్తున్నాడు. భారీ డంపులు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో టిప్పర్లలో ఆర్మూర్, నిర్మల్ వంటి ప్రాంతాలకు తరలించి అక్రమదారుల్లో సొమ్ము చేసుకుంటున్నాడని అధికారులకు సమాచారం అందింది. ఈక్రమంలో దాడులు చేసి అక్రమ వ్యవహారాన్ని రెవెన్యూ అధికారులు రట్టు చేశారు. కాగా గురువారం రాత్రి నిల్వఉన్న ఇసుకను ట్రాక్టర్ల సహాయంతో మరో చోటుకు రైస్‌మిల్ యజమాని తరలించినట్లు తెలుస్తోంది.


కోరుట్లలో పట్టుబడ్డ ఇసుక లారీ

మహారాష్ట్ర దొంగల ఆచూకీ కోసం గాలింపు

జగిత్యాలరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్‌తో పాటు జిల్లాలో పలుప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మహారాష్ట్ర దొంగల ఆచూకీ కోసం మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపడుతున్నట్లు డీఎస్పీరఘుచందర్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. బంగారం, నగదు ఇంట్లో ఉంచుకోరాదని బ్యాంకుల్లో పెట్టాలని ప్రజలకు డీఎస్పీ రఘుచందర్ సూచించారు. వేరే గ్రామాలకు తీర్థయాత్రలకు వెళ్లినపుడు పొరుగింటి వాళ్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని డీఎస్పీ చెప్పారు. దొంగతనాలను అరికట్టడానికి గస్తీ ముమ్మరం చేశామన్నారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

అక్రమంగా నిల్వచేసిన టేకు కలప పట్టివేత


పట్టుకున్న టేకు కలప దుంగలు

రుద్రంగి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన టేకు కలపను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. పోలీసులు పట్టుకున్న టేకు కలపను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. డిప్యూటీ ఎఫ్ఆర్‌వో రాఘవేంద్రరావు కథనంప్రకారం.. రుద్రంగి మండల కేంద్రంలోని గంగారెడ్డి ఇంట్లో అక్రమంగా టేకుకలపను నిల్వచేసి నట్లు విశ్వసనీయ సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 35టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న టేకు కలపను కొలతలు చేపట్టి కలుప విలువ ప్రకటిస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డ వాహనం

గన్నేరువరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి రాజీవ్‌రహదారిపై అక్రమంగా 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సివిల్‌సప్లై అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం గుండ్లపల్లి రాజీవ్ రహదారి వద్ద సివిల్ సప్లయి అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న బొజ్జ రాజును, పికప్ వాహనాన్ని పట్టుకున్న సివిల్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సివిల్‌సప్లై అధికారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్లు చోరీ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోగల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డైనింగ్‌హాల్ ముందు ఉన్న ఆరు సీలింగ్‌ఫ్యాన్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదే విధంగా అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేశారు. తొమ్మిదవ తరగతిగది ముందు స్టార్ గుర్తువేసి కోడిగుడ్డు, నిమ్మకాయలు, పసుపు, మిర్చి, కుంకుమ, బొగ్గుతో క్షుద్ర పూజలు జరిపారు. ఫిర్యాదు అందుకున్న పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పాఠశాల వద్ద పహారాకోసం ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


డైనింగ్‌హాల్‌లో కనిపించని సీలింగ్ ఫ్యాన్లు

కారును ఢీ కొట్టిన ఆటో: ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై కారును వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి వీరయ్య కేశవపట్నంలోని తెలంగాణ గ్రామీణబ్యాంకులో పింఛన్ డబ్బులు తీసుకోవడానికి ఆటోలో వెళ్తున్నాడు. ఈక్రమంలో కేశవపట్నం బస్టాండ్ సమీపంలో ముందు వెళ్తున్న కారును ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న వీరయ్యకు ఎడమ పక్కన భుజానికి తీవ్ర గాయం కాగా, కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని వీరయ్యను 108లో చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


బొడిగె లహరి

సైదాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఆకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బొడిగె లహరి ఎస్ జీఎఫ్ అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు, ఉపా ధ్యాయుడు హన్మండ్ల భాస్కర్ తెలిపారు. విద్యార్థిని ఈనెల 18నుంచి 20 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని తిరుమలపూర్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. లహరిని హన్మండ్ల భాస్కర్ అభినందించారు.

తాటిపల్లి గురుకుల విద్యార్థిని..


దర్శిని

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం దర్శిని రాష్ట్రస్థాయి పాఠశాలల వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కొదురుపాకలో జరిగిన అండర్-17 విభాగం పోటీలలో ఎం దర్శిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినిని ఎంఈవో జయసింహరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు..


అక్షిత్


సాయిచరణ్


క్రాంతి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-19 వాలీబాల్ పోటీల్లో సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కే అక్షిత్, కే సాయిచరణ్ సత్తాచాటారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్- 19 వాలీబాల్ పోటీలకు అక్షిత్, సాయిచరణ్ ఎంపిక య్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కనక విజయ రఘునందన్, కళాశాల క్రీడల ప్రతినిధి కనకయ్య, అధ్యాపకులు, సిబ్బంది అక్షిత్, సాయి చరణ్‌ను అభినందించారు.

● **కోనరావుపేట:** కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడి యట్ చదువుతున్న విద్యార్థి సాల్వల క్రాంతి రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైన ట్లు ప్రిన్సిపాల్ రాజయ్య తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరచగా రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని క్రాంతిని అధ్యాపక బృందం అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వెల్గటూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల్లో వెల్గటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నందయ్య, పీడీ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలో భాగంగా ఈ నెల 16న మల్యాలలోని ఎస్ఎస్‌వీ ఆల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెల్గటూరు విద్యార్థులు గజ్జెల శ్రీవిద్య, బోరె జాశ్విత్, బట్టు గ్రీష్మ టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరిచి ఈనెల 22న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నందయ్య,పీడీ రాజ్‌కుమార్, టేబుల్ టెన్నిస్ ఆర్గనైజేషన్ కన్వీనర్ రాజమల్లయ్య, అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ శ్రీకాంత్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మలత, కొండాల్ రెడ్డి పాల్గొన్నారు.


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రోత్సాహం కోసం తప్పని ఎదురుచూపులు



● కులాంతర వివాహాలు చేసుకున్న వారికి నిరాశ
● సకాలంలో విడుదల కాని నిధులు
● జగిత్యాల జిల్లాలో 205 జంటల నిరీక్షణ

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ వివాహాలు చేసుకున్న దంపతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం అందడంలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహక సొమ్ము కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. కులాంతర వివాహాలు చేసుకుంటే ప్రోత్సాహకాలు అందిస్తామన్న ప్రభుత్వం ఆ మేరకు నిధులు విడుదల చేయడం లేదు. షెడ్యూల్ కులానికి చెందిన అమ్మాయి లేదా అబ్బాయి ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటే ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఇది వరకు రూ.50 వేలు ఉన్న ఆర్థికసాయాన్ని గత ప్రభుత్వం 2019 నవంబరులో రూ.2.50 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

కానీ ఆదర్శ దంపతులకు సంబంధించిన ప్రోత్సాహకాలకు నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడంలేదు. వివాహం చేసుకున్న జంటలకు ఆర్థిక సాయం సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లాలో ఆదర్శ వివాహాలు చేసుకున్న 253 జంటలు ప్రోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీరిలో 68 జంటలకే ప్రభుత్వ సాయం అందింది. ఇంకా 205 జంటల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

నిధులు రాగానే అందజేస్తాం

రాజ్‌కుమార్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జగిత్యాల



ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని రూ.2.50 లక్షలకు పెంచింది. జిల్లాలో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని అర్హులైన జంటలకు అందించి జీవితంలో స్థిరపడేలా కృషి చేస్తున్నాం.



అర్హులు వీరే..

కులాంతర వివాహం చేసుకున్నవారు ఆర్థిక సాయం పొందాలంటే పలు అర్హతలు కలిగి ఉండాలి. దంపతుల్లో ఒకరు తప్పకుండా షెడ్యూల్ కులానికి చెందిన వారై ఉండాలి. మరొకరు ఇతర కులానికి చెందినవారై ఉండాలి. అమ్మాయికి 18 ఏళ్లు కచ్చితంగా నిండి ఉండాలి. వివాహం చట్ట ప్రకారం రిజిష్టర్ అయి ఉండాలి. పెళ్లయిన జంట వార్షిక ఆదాయం రూ.5 లక్షల కంటే తక్కువగా ఉండాలి. మొదటి వివాహానికి మాత్రమే ఈ ప్రోత్సాహకం అందుతుంది. వివాహమైన ఏడాది లోపు జిల్లా షెడ్యూ ల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్థిక సాయం అందుతుంది. కాగా జగిత్యాల జిల్లాలో కులాంతర ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులు ప్రభుత్వ సాయం కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకోగా, నిధులు తక్కువగా విడుదల చేయడం వల్ల అర్హులందరికీ అందడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 లక్షలు ఇస్తుండడంతో కులాంతర వివాహం చేసుకున్న కొంత మంది జంటలు కల్యాణలక్ష్మి వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయాలని కులాంతర వివాహాలు చేసుకున్న పలువురు దంపతులు కోరుతున్నారు.

సింగరేణి మెడికల్ కళాశాలకు 16 పీజీ సీట్ల మంజూరు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో 16పీజీ సీట్లను మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసినట్టు సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు చెప్పారు. ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్-4, ఎంఎస్ అబ్సెట్రిక్ గైనకాలజిస్ట్-4, ఎంఎస్ ఆర్థోపెడిక్-4, ఎండీ బయో కెమిస్ట్రీ-4 మొత్తం 16 సీట్లను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఏడాది క్రితం సిమ్స్ కళాశాలలో పీజీ సీట్లు మంజూరు చేయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్ష, ప్రిన్సిపాల్ హిమబిందు దరఖాస్తు చేశారు. ఎంబీబీఎస్ 4 సంవత్సరంలో అడుగుపెడుతున్న సిమ్స్ మెడికల్ కళాశాలలో అన్నీ వసతులు ఉండడంతో పీజీ విద్యార్థులకు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉండడంతో 16సీట్లను మంజూరు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడుతూ ఐదు డిపార్ట్‌మెంట్లలో 24సీట్ల కోసం దరఖాస్తు చేయగా జనరల్ సర్జన్, పిడియాట్రిక్ పీజీ సీట్లను పెండింగ్‌లో పెట్టారని, అవి కూడా త్వరలోనే మంజూరవుతాయని చెప్పారు. త్వరలోనే ఈ పీజీ కోర్సులకు కౌన్సెలింగ్ జరుగుతాయని, పీజీ విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్, ఇతర వసతులను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన వరద

మళ్లీ తెరుచుకున్న ఎస్సారెస్పీ గేట్లు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు శుక్రవారం స్వల్పంగా పెరిగింది. దీంతో వర ద గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లను తెరిచి 12,500 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్


అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్ వద్ద కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని గోల్డెన్ టెంపుల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దర్శించుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం శ్రీనగర్‌లో పర్యటించి శ్రీనగర్ సమీపంలోని డచ్చిగాం నేషనల్ పార్క్‌ను సందర్శించారు. సాయంత్రం పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్ (స్వర్ణ దేవాలయం)ను దర్శించుకున్నారు.

మందుబాబుల హంగామా..

సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రోడ్డుపై బైఠాయింపు..


రోడ్డుపై బైఠాయించిన మందు బాబులు

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి మందు బాబులు హంగామా సృష్టించిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి మండల కేంద్రంలో సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఇద్దరు మందు బాబులు బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. మద్యం సేవిస్తుండగా పోలీసులు వాహనాన్ని తీసుకుని పోయారని ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సుమారు గంట పాటు హంగామా సృష్టించారు. పోలీసులు చేరుకొని పక్కకు తప్పుకోవాలని సూచించినా వినకపోవడంతో బలవంతంగా పక్కకు లాగి వేశారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు..

విధులకు ఆటంకం కలిగించిన అల్లెపు కనకరాజు, అల్లెపు మల్లిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు సహకరించకుండా దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శాతవాహన పరిధిలోని నేటి పరీక్షలు వాయిదా

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో శనివారం నిర్వహించనున్న ఎంఎడ్ రెండో సెమిస్టర్, బీ ఫార్మసీ రెండో సెమిస్టర్, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన ఎంఎడ్, బీఫార్మసీ పరీక్షలు అక్టోబరు 22న ఉంటాయని, ఎల్ఎల్ఎం పరీక్ష అక్టోబరు 29న ఉంటుందని, మిగిలిన పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులూ లేవని వివరించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అర్బన్ బ్యాంకు ఎన్నికలు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికలు నవంబరు 1న నిర్వహించనున్నట్లు బ్యాంకు ఎన్నికల అధికారి సీహెచ్. మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బ్రాంచి పరిధిలోని ఓటర్లు నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జగిత్యాల బ్రాంచి ఓటర్లు జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాల్సి ఉంటుందని వివరించారు.

21న శాతవాహనలో ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ కోర్సులో 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హత పొందిన, అర్హత లేని అభ్యర్థులకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్ మెంట్, శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ తెలిపారు.

ఎంబీఏలో ప్రవేశం పొందని అభ్యర్థులు (ఐసెట్ -2025 అర్హత పొందిన, అర్హత లేని అభ్యర్థులు) ఒరిజినల్ సర్టిఫికెట్లు, అవసరమైన రుసుముతో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనేజ్ మెంట్, శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్‌లో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని పేర్కొన్నారు. 12సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటి వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

వేగంగా ఆలయ విస్తరణ పనులు..

● ప్రధాన ఆలయంలో తొలగిస్తున్న పైకప్పు రేకులు ● కొనసాగుతున్న భక్తుల దర్శనాలు



రాజన్న ఆలయంలోని పైకప్పు రేకులను తొలగిస్తున్న సిబ్బంది, కోటి లింగాల వైపు ఉన్న క్యూలైన్‌లో దర్శనానికి వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. మొదటి విడతలో రూ. 74 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీంతో రాజన్న ఆలయ ఆవరణలోని కళాభవన్, ఎన్టీఆర్ గెస్ట్‌హౌస్, ఈవో కార్యాలయ భవనాలను కూల్చివేసి చదును చేశారు. కాగా శుక్రవారం రాజన్న ప్రధాన ఆలయంలో భక్తులకు ఎండ తీవ్రతకు, వర్షానికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసిన పైకప్పు రేకుల షెడ్డును సిబ్బంది తొలగిస్తున్నారు.

ఉత్తర ద్వారా నుంచి ఆలయంలోకి వచ్చేందుకు, బయటకు వెళ్లేందుకు, బ్రేక్ దర్శన్ క్యూలైన్‌ల వైపు పనులు జరుగుతుండటంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రధాన తూర్పు ద్వారం పక్కన క్యూలైన్‌లా నుంచి భక్తులను అనుమతిస్తూ, కోటి లింగాల పక్కన క్యూలైన్‌ల ద్వారా అద్దాల మండపం నుంచి స్వామివారి దర్శనానికి అనుమతినిస్తున్నారు.

భీమన్న ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ..

రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో భక్తులు భీమన్న ఆలయంలో స్వామి వారి దర్శనానికి మొగ్గు చూపుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం భీమేశ్వర ఆలయం భక్తులతో రద్దీగా కనిపించింది. భీమన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వందేళ్లు సరిపడేలా రాజన్న ఆలయ నిర్మాణం..

● శృంగేరి పీఠం జగద్గురుకు ఘన స్వాగతం పలకాలి
● వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని వందేళ్లు సరిపడేలా నిర్మాణం చేస్తున్నారని స్థానిక శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 19,20వ తేదీల్లో శృంగేరి పీఠం జగద్గురు విధుశేఖర భారతిస్వామి విచ్చేస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లపై ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధిని రూ. 150 కోట్లతో చేపడుతున్నట్లు చెప్పారు. వం దేళ్ల ఆలయానికి సరి పడేలా ఏర్పాట్లను చేస్తున్నట్లు వివరించారు. రాజన్న ఆలయ అభివృద్ధే ఈప్రాంత ప్రజల, భక్తుల కల అన్నారు.

ఆలయ అభివృద్ధిలో అందరు రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈనెల 19, 20వ తేదీన శృంగేరి పీఠం జగద్గురు శ్రీ విధు శేఖర భారతి స్వామి సాయంత్రం 6 గంటలకు వేములవాడ చేరుకుంటారని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, భక్తులు, నాయకులు హాజరవు తున్నారని, అశేష జన సమూహంతో స్వామివారికి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణోత్త ముల కోరిక మేరకు శంకరమఠంలో శ్రీస్వామి వారి అభిషేక కార్యక్రమానికి హాజరవుతారని సూచించారు. పీఠాధిపతి వేములవాడ రాక ముఖ్యమైనదని, 19వ తేదిన సాయంత్రం 6గంటలకు పట్టణంలోని తెలం గాణ చౌక్‌కు అందరూ చేరుకొని స్వాగత కార్య క్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, వైస్‌ఛైర్మన్ కనికరపు రాకేష్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రాజన్న భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు

● రైతులకు ఉచితంగా రాజన్న కోడెల పంపిణీ
● శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):రాజన్నకు కోడెమొక్కు భక్తుల విశ్వాసానికి ప్రతీక అని స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని కోడెల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు శుక్రవారం కోడెలను ఉచితంగా పంపిణీ చేశారు. గోశాలలోని కోడెల పరిస్థితిని పరిశీలించారు. కోడెలకు పచ్చిగడ్డి అందిస్తున్నారా.. లేదా.. ఆరా తీశారు. అనంతరం కోడెలకు పచ్చిగడ్డిని అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైతులకు ఉచిత కోడెలను పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు నేరుగా కోడె లను పంపిణీ చేయడంతో వారి వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారన్నారు. రైతులు కోడెలను చక్కగా చూసుకుంటూ సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.


రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

అర్హులైన రైతులకు 102 జతల జీవాల పంపిణీ

కలెక్టర్ ఎం. హరిత

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు కలిగి ఆన్‌లైన్‌లో దరఖాస్తున్న చేసుకున్న అర్హులైన రైతులకు 102 జతల జీవాలను పంపిణీ చేశామని కలెక్టర్ ఎం. హరిత అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలలోని కోడెల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించి రైతుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి కోడెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వాటిని వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసకున్న పత్రాలను పరిశీలించి కోడెలను అందిస్తున్నామన్నారు. కోడెలు పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, ఎమ్మార్వో విజయ ప్రకాశ్‌రావు ఉన్నారు.


రైతుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరిత

రాజన్న సేవలో విప్, కాంగ్రెస్ అబ్జర్వర్


ప్రత్యేక పూజలో పాల్గొన్న విప్ మనె శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ అబ్జర్వర్ వి మనె శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ముక్కిపోయి.. పురుగులు పట్టి..

(5వ పేజీ తరువాయి)

ఒకే చోట ఉండడంతో సన్న బియ్యానికి కూడా పురుగు వస్తోంది. లబ్ధిదారులు దొడ్డు బియ్యం కలుపుతున్నారని ఆరోపణలు కూడా చేస్తున్నారు.

● తేలని సర్కార్ వేలంపాట..

రేషన్ దుకాణాలు, గోదాములో నిల్వ ఉన్న దొడ్డు రకం బియ్యాన్ని వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించినా ఇప్పటికి ఆచరణలోకి రాలేదు. వేలంపాట ఎటూ తేలకపోవడంతో దొడ్డు బియ్యం నిల్వలు ఇబ్బందికరంగానే మారాయి. జిల్లాలోని బియ్యం నిల్వలు వివరాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపించారు. దొడ్డు బియ్యం వేలం వేయని పరిస్థితుల్లో బియ్యం పురుగులు పట్టి నాణ్యత కోల్పోయిన తర్వాత వ్యాపారులు కూడా ముందుకు వచ్చే పరిస్థితి ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

నగదును జమచేయాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) మత్స్యకారులకు చేపపిల్లల బదులు ఖాతాల్లో నగదును జమచేయాలని మండల కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకుడు గొడుగు నర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసేదని, ప్రస్తుతం సమయం మించిపోయినందున నగదును సంఘాల్ల జమచేయడం ద్వారా రాబోవు రోజుల్లో నాణ్యమైన చేపపిల్లలను కొనుగోలు చేయడం ద్వారా ఉపాధిని పొందుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మత్స్యకారులు, ముదిరాజ్‌లకు అండగా నిలవాలని కోరారు.

దళారుల చేతిలో పత్తి రైతుల దగా..

- బండరాళ్లతో తూకం వేస్తున్న దళారులు.. - ప్రధాన రహదారి పక్కనే కాంటాలు పెట్టి కొనుగోళ్లు




మూడపల్లి శివారులో రైతు చేను వద్దనే కొనుగోళ్లు, బండ రాళ్లతో తూకం వేస్తున్న దళారులు



వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారి పక్కన పత్తి కొనుగోలు చేస్తున్న దళారులు

చందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు గ్రామాల్లో దళారుల చేతిలో మోసాలకు గురవుతున్నారు. పత్తి సేకరణ చేసిన రైతుల నుంచి దళారులు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో కాంటాలు పెట్టి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు. మండలంలో ఈఏడాది 5740 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటికే మండలంలో పత్తి సేకరణ ఊపందుకుంది. ఇప్పటికే మండలంలోని చాలా గ్రామాల్లో రైతుల వద్ద దళారులు తక్కువ ధరకు భారీ ఎత్తున పత్తి కొనుగోలు చేస్తూ వేములవాడ, కోనరావుపేట ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారు.

సీసీఐ కేంద్రాల ఏర్పాటుతో ప్రయోజనం

భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రం మండలంలో ఇంకా ఎక్కడ ప్రారంభించకపోవడంతో దళారులకు కలిసివస్తోంది. ఇదేఅదనుగా పత్తి రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనకరంగా లగనున్నది. సీసీఐ కేంద్రాలు లేకవడంతో రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. 8నుంచి 12 శాతం తేమతో ఉన్న పత్తికి సీసీఐ క్వింటాల్‌కు రూ. 7689 నుంచి రూ.8110 మద్దతు ధర ఉందని రైతులు పేర్కొన్నారు. గ్రామాల్లో దళారులు తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి రూ.5300 వేల నుంచి రూ. 5800లకే కొంటున్నారు. మండలంలో పత్తి విక్రయా నికి రైతులకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో దళారు లు చెప్పిందే ధర అన్న చందంగా మారింది. దీంతో గిట్టుబాటు ధర లభించడం లేదు.

తూకాల్లోనూ మోసాలు

గ్రామాల్లో దళారులు రోడ్లపై, ఇళ్లముందు పత్తి కొనుగోళ్లు చేస్తూ తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు, దళారులు క్వింటాల్‌కు దాదాపు రెండుమూడు కిలోలను దోచుకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏటా పత్తి సాగుకు పెట్టుబడులు పెరిగిపోతున్నప్పటికీ ఆశించిన మేర దిగుబడులు రాక నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో ఎక్కువ ధర ఆశ చూపి దళారులు తూకంలో మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బండ రాళ్ళ, పత్తి బోరాలు ఎత్తుగా వేసి తూకాలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో పత్తి కొనుగోలు చేసే దళారులపై తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో దళారులు ఇష్టారాజ్యంగా రైతుల వద్ద కొనుగోలు చేస్తూ గుట్టు చప్పుడు కాకుండా రైతులను దోపిడీకి గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలగనున్నది.

సమాన వేతనం చెల్లించాలి..

వేములవాడ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు చేసే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి జైపాల్‌రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలో ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్ యూనియన్ ప్రతమ జిల్లా మహాజనభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సుప్రీం కోర్టు చెప్పిన విదంగా సమాన పనిక సమాన వేతనం ఇవ్వాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తూ, ప్రతి కార్మికునికి ఇన్సూరెన్స్ చేపించాలని, 7,8వ తరగతి చదివిన వారితో, చదువు రాని వారితో మున్సిపల్‌లో డ్రైవింగ్ లైసెన్స్ లేని వారితో ట్రాక్టర్‌లు, ఇతర వాహనాలు నడించేలా అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే కార్మికునికి ఇన్సూరెన్స్ రావడం లేదని, ప్రతి వాహనానికి సైతం ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేణు, కడారి రాములు, అనసూర్య, పోచమల్లు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చందుర్తి అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బీజేపీ నాయకుడు పోంచెట్టి రాకేష్ అన్నారు. మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం చాలా బాధాకరమన్నారు. వర్షం కురవడంతో తడిచిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబం సభ్యులు ధాన్యం రాశుల వద్దనే ఉంటూ పడి కాపులు కాస్తున్నారన్నారు. వర్షానికి తడవకుండా ఉండేందుకు టార్పలిన్ కవర్లు అందించాలన్నారు. మండలంలో ఇప్పటికే 30శాతం వరకు వరకు కోతలు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో రైతులు సిర్రం రాజ మల్లయ్య, బట్టు రవి, గుగ్గిళ్ళ సాగర్, వెంగళ వెంకటేష్, లోలపు అభిలాష్, కైర మధు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న కరెంటు సమస్యల పరిష్కారానికి 'సెస్' కృషి చేస్తోందని డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. మండలకేంద్రంలోని సెస్ కార్యాలయంలో పరిధిలోని రాజన్నపేట ఏఎల్ఎంగా విధులు నిర్వహించే అక్కెం చంద్రయ్య ఇటీవల మృతిచెందగా ఆయన కుమారుడు అక్కెం కేశ్‌కుమార్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వు పత్రాన్ని శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణహరి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్తు అందించడంతో పాటు సెస్ సిబ్బందికి అండగా నిలుస్తోందని అన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని కృష్ణహరి పేర్కొన్నారు. కార్యక్రమంలో సెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు పంపిణీ..

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన వంగపెల్లి శ్రీనివాస్-మంగవ్వ దంపతుల కూతురు దివ్య వివాహానికి కరీంనగర్ డెయిరీ పుస్తె మట్టెలు అందజేసింది. శుక్రవారం కరీంనగర్ డెయిరీ అగ్రహారం బ్రాంచ్ మేనేజర్ గట్టు రవీందర్ దంపతులకు పుస్తె మట్టెలను అందజేశారు. సుపర్‌వైజర్ ఉమ్మారెడ్డి భానుచందర్‌రెడ్డి, అధ్యక్షులు కోల బాలయ్య, సెక్రెటరీ గుగ్గిళ్ల రాజు, టెస్టర్ జగదీశ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రమిదలు

రుద్రంగి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రమిదలను వినియోగించాలని రుద్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దీపావళి పండగను పురస్కరించుకొని మాస్టర్ ఉప్పులూటి వినయ్ చేత మట్టి ప్రమిదల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వాములు కావాలన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

బోయినపల్లి అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు సంతానం ఉన్న వారిని ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బోయినపల్లి మండల కేంద్రంలో టపాసులు పేల్చి సీఎం, మంత్రులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,ఏనుగుల కనకయ్య, బీసీ ఎస్సీ ఎస్టీ గ్రామ జేఏసీ చైర్మన్ మాడిశెట్టి గంగయ్య, కొప్పుల బుచ్చి రాములు, మాడిశెట్టి జనార్ధన్,నల్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, వెంకటేష్, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ను వినియోగించుకోవాలి

చందుర్తి, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): కిసాన్ కసాప్ యాప్‌ను రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమ్య సూచించారు. బండపల్లి రైతు వేదిక క్లస్టర్‌లో రైతులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాప్ పనితీరును రైతులకు వివరించారు. రైతులు పత్తిని సీసీఐ ద్వారా విక్రయించడానికి ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. సాంకేతికపరమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ఇల్లంతకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెద్దలింగాపూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్ పసుల అంజలి స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలగౌడ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, ముత్తవ్వ, హారిక, పవిత్ర, సహజ, సింధులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

చేపపిల్లల బదులు నగదును జమచేయాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు చేపపిల్లల బదులు సంఘాలలో నగదును జమచేయాలని మండల కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు గొడుగు నర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసేదని, ప్రస్తుతం సమయం మించిపోయినందున నగదును సంఘాలలో జమచేయడం ద్వారా రాబోవు రోజుల్లో నాణ్యమైన చేపపిల్లలను కొనుగోలు చేయడం ద్వారా ఉపాధిని పొందుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మత్స్యకారులు, ముదిరాజ్‌లకు అండగా నిలువాలని కోరారు.

లింగన్నపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

గంభీరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయ తిరుపతి, తహసీల్దార్ మారుతిరెడ్డి, సీసీ శ్యామల, నాయకులు జోగు సురేష్, నర్సింలు, నాగార్జున, మహేష్, వెంకటేష్, వినోద్, రాజు, మధు, మల్లయ్య, రాజశేఖర్, కిషన్ రైతులు పాల్గొన్నారు.

తేమ శాతం ఆధారంగా ధాన్యం కొనుగోళ్లు

- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి - అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : తేమ శాతం ఆధారంగా ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కొనుగోలుదారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం 2025-26 ధాన్యం సేకరణపై ఐకేపీ సెంటర్ల నిర్వాహకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ జిల్లాలో మహిళా సంఘాల బాధ్యులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించారన్నారు. మహిళా సంఘాల బాధ్యులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం నాణ్యత ఆధారంగా ధాన్యం కొను గోలు చేయాలని సూచించారు. సరైన తేమ శాత వచ్చిన రైతుల ధాన్యం సేకరించి కేటాయించిన రైస్‌మిల్లులకు మాత్రమే తర లించాలన్నారు. గ్రేడ్ ఏ రకానికి రూ 2369 ధర ప్రభుత్వం నిర్ణయించందని వివరించారు. సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు అదనంగా బోనస్ రూ.500 ప్రభుత్వం ఇస్తుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించిన సన్నరకం ధాన్యానికి మాత్రమే బోనస్ అందుతుందని పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని రైతులకు టెంట్‌లు వేసి నీటి సదుపాయాలు కల్పించాలన్నారు. తేమ శాతం, తాలు తప్ప తదితర అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం సేకరణ పూర్తియిన వెంటనే రైతుల వివరాలు ట్యాబ్‌లో ఏంట్రీ చేయాలని, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేల చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీ శేషాద్రి, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఏపీఎంలు పాల్గొన్నారు.

రేపటి బంద్‌ను విజయవంతం చేయండి

వేములవాడ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శనివారం తలపెట్టిన బంద్ విజయవంతం చేయాలని,బంద్‌కు కాంగ్రెస్ పక్షాన పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రకటించారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42శాతం విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసిందన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో బిల్లులను పాస్ చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో కృత నిశ్చయంతో ముందుకుపోతున్న తరుణంలో హైకోర్టు స్టే రావడం బాధాకరమని తెలిపారు. బీసీ సంఘాలు ఇచ్చిన బంద్‌కు పీసీసీ అధ్యక్షుడు కూడా సంఘీభావం తెలిపారని వెల్లడించారు.కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. శనివారం జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు ఉద్యమించాలి

గంభీరావుపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల అమలుకు ఉద్యమించాలని, బంద్‌ను విజయవంతం చేయాలని ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం పిలుపునిచ్చారు. గంభీరావుపేటలో శుక్రవారం విలేకరుల సమావేశంలో చంద్రం మాట్లాడుతూ బీసీల 42శాతం రిజర్వేషన్ కోసం బీసీలు తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమించాలన్నారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చి అమలు చేయాలన్నారు. తమిళనాడు తరహాలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు అంగీకారం తెలిపినందున కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ అమలు కోసం బీసీ జేఏసీ ఇచ్చిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గావాయిపై దాడి చేసిన న్యాయవాది రాకేష్‌కిషోర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు బడుగు లింగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మన్, జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, వీహెచ్‌పీ జిల్లా కన్వీనర్ శోభారాణి, ఎంఆర్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సావనపల్లి రాకేష్, నాయకులు లచ్చయ్య, గాదపాక నాగార్జున, నర్మెట సుమన్, బడుగు చిన్న లింగయ్య, నారాయణ, బాబు, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● రుద్రంగి : రుద్రంగి తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రంఅందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో అఖిల పక్ష కమిటీ నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు తర్రే లింగం, కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు గండి నారాయణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దయాల కమలాకర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గండి శ్రీనివాస్, నాయకులు కొమురె శంకర్, మాడిశెట్టి ఆనందం, గంగం మహేష్, దయ్యాల రమేష్, ఎర్రం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాట్లాడారు. ఎంఆర్పిఎస్ నాయకులు కొమ్ము రాజశేఖర్, రాజయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు.



సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

● ఇల్లంతకుంట : తహసీల్దార్ కార్యాలయానికి పలు గ్రామాల నాయకులు శుక్రవారం చేరుకొని ఆర్ఐ సంతోష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల కార్యదర్శి బాబు, నాయకులు రామంచ మధు, గడ్డం సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలోని నాయకులు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. అనంతరం తహసీల్దార్లు సుజాత, ముక్తార్‌పాషాలకు వినతి పత్రం సమర్పించారు. లక్ష్మణ్, నర్సయ్య, సతీష్, భగవంతం, కనుకరాజు, సామ్యూల్, బాలయ్య, శంకర్, దేవయ్య, అంజయ్య, శ్రీనివాస్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజే 300 మద్యం దరఖాస్తులు

- 21రోజుల్లో 852 దరఖాస్తులు - రూ.25.56కోట్ల ఆదాయం

సిరిసిల్లక్రైం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం టెండర్‌లకు ఇప్పటి వరకు 852 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. ఈ దరఖాస్తు ఫీజు ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ. 25.56కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేసిన 3కౌంటర్‌లలో శుక్రవారం 300 దరఖాస్తులు దాఖలయ్యాయి. అంతకుముందు వచ్చిన 552 దరఖాస్తులతో కలిపి 21రోజుల్లో మొత్తం 852 దరఖాస్తులు సమర్పించారు. జిల్లాలోని 48 వైన్స్‌లకు కేవలం 48 వైన్స్‌లకు టెండర్ దరఖాస్తులు వేయగా, షాప్ నంబర్ 11,55లకు 39 అధికంగా వేశారు. ఒక్క వైన్స్‌కు రెండే దరఖాస్తు దాఖలు చేశారు. ఇక మరొక్క రోజే మాత్రమే గడువు ఉంది. అయినప్పటికీ శనివారం వెయ్యికి పైగా దరఖాస్తులు అధికంగా వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుభోదయం గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ మాధవి లతారెడ్డి, ప్రీప్రైమరీ ఇన్‌చార్జి పద్మశ్రీ, పీఈటీ అజయ్‌కుమార్, సౌజన్య, రమ్య, వాణీ, లావణ్య సాయి ప్రియ పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్ : వేములవాడ పట్టణంలోని శ్రీచైతన్య, గౌతమ్ మోడల్ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్‌లో విద్యార్థులు సాంప్రాదాయ దుస్తులు ధరించి పూలతో అందంగా అలంకరించి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపాల్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధనకు పోరాటం..

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీల హక్కులను సాధించే వరకు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగించాలని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో శుక్రవారం ఆ సంఘం నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషనుపై హైకోర్టు స్టే విధించడానికి నిరసనగా ఈనెల 18న జరిగే రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. బంద్‌కు అన్ని వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు, ప్రజలు సహకరించాలని కోరారు. పార్టీలకతీతంగా బీసీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు బాల్‌రెడ్డి, నర్సయ్య, రాజు, గౌస్, కైలాసం, దేవేందర్, నర్సింలు, నర్సయ్య, మహేందర్, శ్రీనివాస్, కల్యాణ్, కిషన్, లక్ష్మణ్, లక్ష్మీనర్సు, తిరుపతి, భూపతి, బాలగౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యతను చాటాలి..

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఐక్యతను చాటాలని బీసీ సంఘాల జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో మార్కండేయ దేవాలయంలో బీసీ సంఘాల జేఏసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు, పలు పార్టీల నాయకులు కందుకూరి రామగౌడ్, ఎగుర్ల కరుణాకర్, గజభీంకర్ రాజన్న, మచ్చ శ్రీనివాస్, కొల ఆంజనేయులు తదితరులు మాట్లడుతూ బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు కోసం శనివారం నిర్వహించే బందును విజయవంతం చేయాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు బందుకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎగుర్ల ప్రశాంత్, మోర లక్ష్మీనారాయణ, కట్ట రవి, గాదె సత్యనారయణ, రాపెల్లి ఆనందం, అనిల్‌గౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

- బీసీ సంఘాల జేఏసీ నాయకులు



సమావేశమైన బీసీ సంఘాల జేఏసీ నాయకులు

చందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం బీసీ సంఘాలు ఇచ్చిన బందుకు సంపూర్ణ మద్దత్తు ఇస్తున్నామని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు నీరటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న 5 శాతం ఉన్న ఓసీలు, ఓబీసీ ద్వారా 10 శాతం రిజర్వేషన్ అనుభవిస్తున్నారన్నారు. అత్యధికంగా 25శాతం ఉన్న బీసీలు 42 శాతం అడుగుతే తప్పేంటి అన్నారు. బీసీలకు సరియైన న్యాయం జరిగే వరకు వారికి జాతీయ మాల మహానాడు అండగా నిలుస్తుందన్నారు.

● బీసీల 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం బీసీ జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు ఇచ్చిన తెలంగాణ బంద్ పిలుపును విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు చిలుక పెంటయ్య పేర్కొన్నారు. చందుర్తిలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ శనివారం బంద్‌కు హోటల్లు, షాపులు, విద్యాసంస్థలు, బందుకు సహకరించి, విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ, జీవో9ను ఇచ్చి దాదాపు 2.5కోట్ల బీసీలను మభ్య పెడుతున్నదన్నారు. అందులో చిత్తశుద్ధి మచ్చుకైనా లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే రాజ్యంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు తిప్పని శ్రీనివాస్, మరాటి మల్లీక్, బైరగోని రమేష్, ఈర్లపల్లి రాజు, సిరికొండ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : బీసీ రిజర్వేషన్‌లపై ఇచ్చిన బంద్ పిలువు మేరకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా అన్నారు. కోనరావుపేటలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌ల సందర్భంగా తెలంగాణ బంద్ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ పోటీ మద్దతు ప్రకటించిందని అన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు ఈ బందులో పాల్గొనాలని కోరారు. కచ్చకాయల బాల్‌రెడ్డి, ఉప్పుల గంగయ్య, సుంకరి మహేష్, బొడ్డు రమేష్, నీరటి సంజీవ్, సుంకరి రెడ్డి, పరశురాములు, బుర్ర రమేష్ తదితరులు ఉన్నారు.

● తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి నూనె మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు. కోనరావుపేటలో ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లను రక్షించుకోవడం కోసం 18న నిర్వహించే బంద్‌లో బీసీలు, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● ఇల్లంతకుంట : బీసీల హక్కుల కోసం జేఏసీ శనివారం ఇచ్చిన బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంఘ మండల అధ్యక్షుడు గుంటి మహేష్ ఒక ప్రకటనలో కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు.

విద్యా, వ్యాపార సంస్థలు, అన్నివర్గాల ప్రజలు బంద్‌లో స్వచ్ఛందగా పాల్గొని సహకరించాలని కోరారు.